


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మెచ్యూరిటీ?

**అసలు మీరేమిటో** మీరు తెలుసుకోవడానికి గూగుల్‌లో ఎన్ని టెస్టులో!! ఖాళీగా ఉంటే కొట్టి చూడండి. మన మెగా బ్రదర్ నాగబాబుగారి సీరియల్ సీతామాలక్ష్మి స్క్రీన్‌ప్లే చేస్తున్నాను. ఆయనతో కూర్చుంటే సాహిత్య చర్చ చాలా బావుంటుంది. ఎంత లావుపుస్తకం అయినా ఆపకుండా ఒకటి రెండు రోజుల్లో ఇంత బిజీ షెడ్యూల్స్‌లో కూడా చదివేస్తుంటారు. ఆయన చదివిన పుస్తకం ఎన్ని ఏళ్ళయినా లైన్ టు లైన్ గుర్తు ఉంటుంది. కళ్ళకి కట్టినట్టు చెప్తారు. దాన్నే మేం స్క్రీన్‌ప్లే అంటాం. కొంతమంది కళ్ళకి గంతలు కట్టినట్లు చెప్తారు.

సడెన్‌గా ఒకరోజు "రమణీగారూ.. నేను మోసగాడ్ని... అబద్ధాల కోరుని... చెడ్డవాడిని.. 100% మెక్‌వేలియన్‌ని.."అన్నారు.

నేనూ మా ప్రవల్లికా (క్రియేటివ్ హెడ్ కమ్ సీతామహాలక్ష్మి హీరోయిన్) షాక్ తిన్నాం.

"నాగురించి నాకు ఇవాళ పూర్తిగా తెలిసిపోయింది" అని సీరియస్‌గా సిగరెట్ అంటించారు.

మొహంలో చాలా సిన్సియారిటీ, ప్రపంచాన్ని జయించినంత విశ్వాసం కనిపిస్తోంది.

"ఏమైంది సార్? ఎవరేమన్నారూ?" అన్నాను.

"మెక్‌వేలియనిజం గురించి గూగుల్‌లో ఓ టెస్ట్ ఉంది. అందులో ప్రశ్నలకి సిన్సియర్‌గా సమాధానాలు ఇచ్చాను. నాకు 75% మార్కులొచ్చాయి. అంటే డిస్టింక్షన్. నేను పూర్తిగా మెక్‌వేలియన్‌ని. నేను ఏదైనా చెప్తే నమ్మకండి. నేను చెడ్డవాడ్ని" అన్నారు.



నాకేం అనాలో బోధపడలేదు. కానీ "ఛ. మీరు చాలా నిగర్వి, మంచివారు. నాకు తెలిసి ఎవరికీ అపకారం చెయ్యరు. ఉపకారమే చేస్తారు. అబద్ధం అయితే అసలు చెప్పనే చెప్పరు" అన్నాను. ఇది సిన్సియర్‌గా ఆయన పట్ల నా అభిప్రాయం.

"చూసారా.. మీ అంత తెలివైన వారినీ, రచయిత్రినీ కూడా ఎలా నమ్మించానో.. నేనెంత మెక్‌వేలియన్‌ని" అన్నారు.

నేనూ ప్రవల్లికా, ఇంక నచ్చచెప్పి ప్రయోజనం లేదని, "సరే ఆ టెస్ట్ మేమూ తీసుకుంటాం" అని ఆ సైట్‌కి వెళ్ళాం.

మేం టెస్ట్ పెట్టేవాడినే ఎక్స్‌ప్లాయిట్ చేయదలచి రాంగ్ ఆన్సర్స్ ఇచ్చాం.

అంటే ఉదాహరణకి మీకు లక్షరూపాయల సూట్‌కేస్ దొరికింది

A) పోలీసులకి అప్పగిస్తారు.

B)పేపర్లో ప్రకటన ఇస్తారు.

C)మీరే ఉంచేసుకుంటారు

D) కాసేపు చూసి ఎవరైనా వచ్చి అడుగుతారేమో అని చూసి ఇంటికి తీసుకెళ్ళిపోతారు

ఇలా ఉంటాయి ఆప్షన్స్.

మేం కావాలని (A) పోలీసులకి అప్పగిస్తాం అని రాసాం.

అలాగే మీరు అబద్ధం ఎలాంటి సమయంలో ఆడ్తారూ?

A)ఆపద సమయంలో

B)అస్సలు ఆడము

C)సరదాకి

D)ఎదుటివాడికి హాని చెయ్యడానికి

మేం (B) అస్సలు ఆడం అన్నాం.

సో... రిజల్ట్ చూసుకుంటే మా ఇద్దరికీ (జమిలీగా రాసాం) 96% మేక్‌వేలియన్స్‌మి అని వచ్చింది.

అంటే మేం అన్నీ అబద్ధాలే చెప్పాం అని ఆ గూగుల్ వాడు గ్రహించేసాడు.

ఈ విషయం ఆయనకి చెప్పి "మీ కన్నా మేం ఎక్కువ చెడ్డవాళ్ళం బాధపడకండి" అని చెప్పాం.

అయినా లంచ్ టైంలో ఆయన ఫ్రెండ్స్ వస్తే వాళ్ళతో "ఇంతకాలం అనుమానం ఉండేది. ఇప్పుడు తెలిసిపోయింది. నేను హైలీ మెక్‌వేలియన్‌ని. అంటే అబద్ధాలూ, కపటం, మోసం అన్నీ 75% ఉన్నాయి" అని చెప్పడం విన్నాను.

ఈ మెక్‌వేలియన్ ప్రచారం ఎంతకాలమో అని బాధపడ్డాను. కానీ ఆయన మర్నాటికి గూగుల్‌లో ఇంకో టెస్ట్ పాసయ్యారు. దాంతో ఆయన ఏ క్షణం అయినా సన్యసించచ్చు, ఆధ్యాత్మిక చింతనలో పడి అన్నీ వదిలేసి వెళ్ళిపోవచ్చూ అని తెలిసింది.

బ్రతికాం అని దీర్ఘంగా నిట్టూర్చాను. ఇందులో కొంత హాస్యం ఉన్నప్పటికీ, ఆయన స్వభావం అలా నిష్కల్మషంగా చిన్నపిల్లాడిలా ఉంటుంది.

మా భువనచంద్రగారు రాసిన 'వాళ్ళు' పుస్తకం ఆయనకి ఇచ్చాను. అది చదివి చాలా కదిలిపోయారు. ఆయన ఆధ్యాత్మిక పుస్తకాలు వందల్లో చదివి ఉంటారు. ఇది ఇప్పటి వరకూ చదివిన వాటిల్లో 'ది బెస్ట్' అని చెప్పారు. ఆ తరువాత 'నాకు హిమాలయాలకి వెళ్ళిపోవాలనుంది' అన్నారు.



"మరి సీరియలో?" కంగారుగా అడిగాను. ఇంకోటి కూడా మొదలు పెట్టబోతున్నాం త్వరలో మరి.

"ఇంక అవన్నీ మీరూ ప్రవల్లికా చూసుకోండి.. డబ్బులూ లెక్కా చూసుకోడానికి శ్రీవాధ్ ఎలాగూ ఉన్నాడు" అన్నారు.

సింబాలిక్‌గా కాషాయ వస్త్రాల్లో ఉన్నారు ఈ మాటలు చెప్పేటప్పుడు.

నా మనసులో "అసలు నన్ను ఈ 'వాళ్ళు' పుస్తకం ఈయనకి ఎవరు ఇమ్మన్నారూ? ఇచ్చాను పో.. మళ్ళీ ఆ పుస్తకం గురించి డిస్కషన్ ఎందుకు పెట్టాను?" అని సవాలక్ష

తిట్టుకున్నాను. చాలా కంగారు పడ్డాను.

ప్రవల్లిక తాపీగా కనిపించింది. ఎందుకా అనుకున్నాను. తరువాత చెప్పింది "గూగుల్‌లో ఇంకా చాలా సైట్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఆయన నిరంతర విద్యార్థిలా అవన్నీ స్టడీ చేస్తూనే ఉంటారు మేడం. మీరు కంగారు పడకండి" అంది.

కానీ మనిషిలో ఆ ఆధ్యాత్మిక చింతన ప్రారంభం అయితే అది పెరగడమే తప్ప తరగడం ఉండదు. మనుషులు అందరిపట్లా ప్రేమ కలుగుతుంది. అందరూ మనవాళ్ళే అనిపిస్తుంది. డబ్బు ఇవ్వలేని ఆనందం ఒకటి ఉంది. దాన్ని పొందాలన్న అన్వేషణ మొదలవుతుంది.

నాగబాబుగారు కొన్ని మమ్మల్ని నవ్వించడానికి చేస్తుంటారు కానీ ఆయనలో నిరంతర అన్వేషణ మాత్రం చెక్కు చెదరదు. పుస్తకమో, గూగులో ఏదో ఒకటి చేతబట్టి చదివి మాకు కొత్త సంగతులు చెప్తూనే ఉంటారు. ఆయనకున్న గొప్ప లక్షణాల్లో ఒకటి హాస్య ప్రియత్వం. నేను కొంచెం కామెడీ రాస్తే, దాన్ని ఇంకో 60 పర్సెంట్ డెవలప్ చేస్తారు. జోక్ వినగానే ఎంత నవ్వుతారంటే, జబర్దస్త్ ప్రోగ్రాంలో అది కావాలని నవ్విన నవ్వు అనుకునేదాన్ని ముందు.. కాదు నిజంగానే ఆయనకు నవ్వు ఎక్కువ.

ఒక నటుడు ఏంకర్ అతినల్లని ఛాయగలవాడు ఒకతను నాగబాబుని చూడటానికి వచ్చాడు. 'సర్ మీరు ఇక్కడున్నారని వచ్చాను. పక్క సెట్‌లో నా షూటింగ్'. నాగబాబు చాలా ప్రేమగా భుజం మీద చెయ్యేసి పలకరించి నాకు పరిచయం చేసారు. అతను లేచి వినయంగా 'నాకు మేడం తెలుసు. కానీ మేడమ్.. మొదటి నుండి నేను ఇంత నల్లగా ఉండేవాడిని కాదు. తలకి డై వేస్తే ఆ అమ్మోనియా నా మొహం మీదకి కారి ఇలా నల్లగా అయిపోయాను. ఈ రంగు నాకిప్పుడు వరమైంది. వేషాలొస్తున్నాయి అన్నాడు.'

ఏదో రాసుకుంటున్న నాగబాబుగారు తలెత్తి 'నువ్వా భ్రాంతిలోంచి బైటికిరా పుట్టినప్పుటి నుండి నువ్వు నలుపే డై చేసుకుంటే అది మొహం మీదకి కారి నల్లగా అయితే మిగతా శరీరం మాటేంటి? నిన్ను నువ్వు అలా మభ్యపెట్టుకోవడం మానెయ్యి. ఫాక్ట్స్ యాక్సెప్ట్ చెయ్యి అని చెప్పారు.' అతని మొహం ఇంకా నల్లగా మాడిపోయింది. కాసేపు చీకటిలో కనిపించటం మానేశాడు. అలాంటి సమయంలో ఊరుకుంటే మనం మనమెందుకవుతాం. నేను వెంటనే 'నలుపు అనేది శాపం కాదండి. అసలది తప్పు కూడా కాదు. 'విల్స్ స్మిత్,' 'ఎడ్డీ మర్ఫీ'లాంటి నల్ల హీరోలంటే నాకెంతో ఇష్టం. చాలా మంది అమ్మాయిలు పడిచచ్చిపోయేవారు. వాళ్ళు పెద్ద హీరోలయ్యారు' అని చెప్పాను.

ఇది విని నాగబాబుగారు 'రమణీగారూ నేను భ్రాంతిలోంచి బైటికి లాగుతుంటే మీరు ఇంకొక భ్రాంతి లోకి ఎందుకు పడేస్తున్నారు? రేపటినుండి వీడు 'విల్స్ స్మిత్'లా ఫీల్ అయి అమ్మాయిలు తనవెంట పడటంలేదే అని విచారిస్తుంటాడు. ఇలా భ్రమలో పెట్టట్టం క్రైం తెలుసా?' అని నాతోటన్నారు. అలా అనేటప్పుడు ఆయన మొహంలో సిన్సియారిటీ చూస్తే మనకి తెగ నవ్వొస్తుంది.

ఒక సన్నివేశంలో ఒక సేఠ్ వేషం వేసిన నటుడు కూర్చున్నవాడు లేవడానికి అవస్థ పడుతూ మూడు దశలుగా లేచాడు. వెంటనే నాగబాబుగారు 'ఏంటి ఇన్‌స్టాల్ మెంట్స్‌లో లేస్తున్నాడు వీడు?' అన్నారు.



నేను బాగా నవ్వి 'ఇది మీ సొంత డైలాగా సర్?' అన్నాను.

'కాదు ఓ సారి మా అన్నయ్య వాళ్ళ మామగారు రామలింగయ్యగారిని ఇలా అన్నారు 'ఏమిటి మామయ్యగారూ ఇన్‌స్టాల్ మెంట్స్ మీద లేస్తున్నారు?' అన్నారుట. దానికి రామలింగయ్యగారికి తెగ నవ్వొచ్చి మళ్ళీ వెంటనే కూలపడ్డారట.' చిరంజీవిగారు, అల్లురామలింగయ్యగారు ఇంత హాస్యంగా మాట్లాడుకునేవారట.

ఒకరోజు నేను మా అక్కినేని నాగేశ్వరరావుగారితో మాట్లాడ్తూ ఉంటే ఆయన "నీకు వయసు తక్కువా.. జీవితం ఎక్కువా రమణీ" అన్నారు.

"అంటే?" అన్నాను.

"ముప్పై ఏళ్ళు వచ్చేలోగా నీకు అయిన అనుభవాలూ, తారసపడ్డ వ్యక్తులూ అందరూ గొప్పవాళ్ళే... అందుకే అరవై ఏళ్ళకి రావలసిన మెచ్యూరిటీ నీకు ఇప్పుడే వచ్చేసింది" అన్నారు.

ఇంతలో బోయ్ వచ్చాడు. "కాఫీనా, టీనా?" అని అడిగారు ఆయన.

"ఐస్క్రీమ్ తినాలనిపిస్తోంది" అన్నాను.

ఆయన ఒక్క క్షణంలో తేరుకుని, నవ్వి "వెళ్ళి మెల్టింగ్‌స్టోన్స్ నుండి మంచి ఐస్క్రీమ్ పట్రా రమణికి" అని బోయ్‌ని పంపించి "నీలోని చైల్డ్‌ని ఎదగనివ్వకపోవడమే నిజమైన మెచ్యూరిటీ" అన్నారు.





ఈ మెచ్యూరిటీ.. పరిపక్వత... ఈ పదం నన్ను ఎప్పుడూ డైలమాలో పడేస్తోంది.

నేను జీవితంలో పొందిన జ్ఞానం ఏదైనా ఉంటే పెద్దలు రాసిన పుస్తకాలవల్లా, నా స్నేహితులవల్లా వచ్చినదే

నా లైఫ్‌లో గురువుగా వీరేంద్రనాధ్‌ని సంబోధిస్తాను. మల్లాదిగారినీ, సత్యానంద్‌గారినీ, పరుచూరిగార్లని గురువులుగా భావిస్తాను. సింగీతం శ్రీనివాసరావుగారి డైరెక్షన్‌లో నటించేటప్పుడు ఆయన దగ్గర సృజనాత్మకతకి వయసు రాదు అని తెలుసుకున్నాను.

అక్కినేని నాగేశ్వరరావుగారినీ, రామానాయుడుగారినీ, అల్లు అరవింద్‌గారినీ, భువనచంద్రగారినీ, ఇప్పుడు నాగుబాబుగారిని స్నేహితులుగానే భావిస్తాను.

వారి వయసుని బట్టి నాగేశ్వరరావుగారికీ ,, రామానాయుడుగారికీ కాళ్ళకి దణ్ణాలు పెట్టడం, సంబోధించడం చెయ్యలేదు. వాళ్ళతో ఫ్రెండ్ షిప్ చేసాను. అంటే వారి అనుభవాలు వినడం... నా మనసులో తోచినది పైకి నిస్సంకోచంగా చెప్పడం. అందరి నుండీ ఎంతో కొంత నేర్చుకున్నాను అనే అనుకుంటున్నాను. వాళ్ళూ నన్ను స్నేహితురాలనే భావించారు.



నిన్న ప్రొద్దుట డ్రైవర్ మీద చాలాకోపం వచ్చింది. రెండురోజులుగా సెల్ స్విచ్చాఫ్‌లో పెట్టాడు. మూడోరోజు వచ్చి "సెల్ పాడయింది, చూసుకోలేదు" అన్నాడు. అది అబద్ధం అని నాకు అనిపించింది.



మేడం నన్ను రెండు రోజులు ఎందుకు పిలవలేదూ? అని కనీసం ఇంటికి వచ్చి చూడాలిగా?

నేను రాగానే "నీ వల్ల నా పనులు ఆగిపోయాయి. కేబ్‌లో తిరగాల్సి వచ్చింది అని అరుస్తున్నాను.

అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసారు ఆయనకి వస్తానని చెప్పి, డ్రైవర్ లేక వెళ్ళలేదు. ఆయనతో ఈ గొడవంతా చెప్పుకొచ్చాను.

అప్పుడు ఆయనో మంచిమాట అన్నారు. "నీ ప్రెషియస్ మార్నింగ్ ఎనర్జీని ఇలా డ్రైవర్లమీదా, పనిమనుషుల మీదా ఖర్చు చెయ్యకు.. మళ్ళీ అది తయారు అవాలంటే 24 గంటలు

పడ్తుంది. ఇంకా చాలా ఉపయోగకరమైన పనులున్నాయి'' అన్నారు.

నాకు చెంపమీద కొట్టినట్లయింది. ఇలా ఎన్నోసార్లు వీళ్ళ మీద అరిచి నారోజు పాడుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. దానివల్ల పనిపాడయి, చెడ్డ పేరొస్తుంది. నేర్చుకుంటే జీవితంలో ప్రతి మనిషీ ఒక పాఠం చెప్పగలరు.



మా ఇంటి పక్క వాళ్ళ మామిడి చెట్టు మావైపే ఎక్కువ కాస్తుంది. డాబా మీద నేలమీద కాయలు పరుచుకున్నట్లు కాసేది. ఇది పక్కింటి ఆవిడకి భరించరాని అసూయకి కారణం అయి, చెట్టు కొట్టించేసింది.

ఆవిడ వచ్చి కోసుకోవచ్చు, లేదా, చెట్టు రెండువేల కాయలకి పైగా కాస్తుంది. అమ్మేయొచ్చు.

కానీ నేనో ఇరవై కాయలు కోసుకుంటున్నానని కొట్టేయించింది. ''అలా చెయ్యద్దు.. నేను కొయ్యను'' అని ప్రాధేయపడ్డాను. ఎందుకంటే, వారింట్లో అద్దెకి ఉన్నప్పుడు హేండ్ బోరింగ్ కొట్టి నీళ్ళు పోసి ఆ చెట్టుని పెంచాను. ఆవిడ వినలేదు.

ఇది జరిగిన రోజున నేను కంట తడిపెట్టి, ఒక నిండు ప్రాణాన్ని వాళ్ళు కర్కశంగా నరుకుతున్నట్లు ఫీలయి షూటింగ్‌కి వెళ్ళలేదు.

వీరేంద్రనాథ్ అంతర్ముఖంలో రాసారు ''ఒక చెట్టు పెరగాలంటే పదేళ్ళు పడ్తుంది.. నరకాలంటే అరగంట పడ్తుంది'' అని. అందుకు ఏడ్చాను.

ఈ విషయం మా ప్రవల్లికకి చెప్పుకున్నాను. నాగబాబుగారు మధ్యాహ్నం ఫోన్ చేసి ''మీ బాధ చాలా జెన్యూన్.. నేను అర్థం చేసుకోగలను.. వాళ్ళమీద గో గ్రీన్ వాళ్ళకి కంప్లైంట్ ఇవ్వచ్చు'' అని చాలా కన్‌సెర్న్‌గా మాట్లాడారు. ఎంతో విలువయిన ఆయన సమయం ఈ ఓదార్పుకి కేటాయించడంలోనే ఆయన సున్నితత్వం తెలుస్తుంది.

మా రామానాయుడుగారు ఎప్పుడూ ఒకమాట చెప్పేవారు ''కోపం వస్తే వీపు మీద కొట్టొచ్చు.. పొట్ట మీద కొట్టకూడదు'' అని.



అలా అని ఆయనది చెయ్యి చేసుకునే స్వభావం అనుకోకండి... కానేకాదు. ఎంతో సున్నితమైన హృదయం.. కథలో చిన్న కష్టం చెప్పినా ఆయన కళ్ళు నీళ్ళతో నిండి, గొంతు గద్గదికం అయిపోయేది. హాస్య సన్నివేశాలు చెప్పేటప్పుడు నవ్వుతూ ఆయనకి దగ్గు తెప్పించాలి. అప్పుడే అది కామెడీ అని ఆయన ఒప్పుకునేవారు. ఆయన మళయాళం తీసినా, పంజాబీ తీసినా, బెంగాలీ తీసినా రమణి, సత్యానంద్ గార్లు వినాలి అని మమ్మల్ని పిలిపించేవారు. ప్రతిరోజూ ఏదో ఒక వంకతో నన్ను స్టూడియోకి పిలిచేవారు. రామానాయుడు స్టూడియో నా రెండో ఇల్లులా ఉండేది. అది చాలా మిస్సవుతున్నాను. ఆయనగురించి తలచుకుంటుంటే కళ్ళల్లో నీళ్ళు వచ్చేస్తుంటాయి. ఈ రోజుకి ఆయన లేరన్న సత్యం నాకిప్పటికీ మింగుడు పడటంలేదు.

'నేనేం చిన్నపిల్లనా?'లో ఆమనిది హీరోకి సవితి తల్లి కేరెక్టర్. రెండుసార్లు అతన్ని తిట్టి, ఇంట్లోంచి బయటకి పొమ్మంటుంది.. ఆయన వెంటనే నన్ను ఆపి ''సవతి తల్లిని చెడ్డగా చూపించద్దు'' అన్నారు.

నిజజీవితంలో ఆయన తల్లిని ఆయన చూడనేలేదు. సవితితల్లే పెంచింది. ఆవిడని ఆయన దేవతలా భావించేవారు.

"కాదండీ.. తర్వాత రివీల్ చేస్తాం.." అతని మంచికోసమే అలా చేస్తుంది ఆవిడ" అంటే, అప్పుడు ఒప్పుకున్నారు. తల్లి స్థానంలో ఉన్నవాళ్ళని అంత గౌరవించాలని ఆయన ఉద్దేశం. నాకు అదొక పాఠం.. మనం అత్తగార్లనీ, సవితి తల్లినీ చెడ్డగా చూపించి పవర్ ఫుల్ మీడియా ద్వారా ఏం చెప్తున్నాం? అని ఆలోచించాను.

మొన్న ఒక జంటకి మేరేజ్ కౌన్సిలింగ్ చేసాను. నా అదృష్టం కొద్దీ, ఇద్దరూ విడిపోవాలనుకున్నవాళ్ళు, నా సలహాలు నచ్చి కలిసుండడానికి ట్రై చేసి, సఫలం అయ్యారు. ఇది తెలిసిన మల్లాదిగారు నాకో బుక్ ప్రెజెంట్ చేస్తూ "ఒక జంట విడిపోకుండా, తన కౌన్సిలింగ్ ద్వారా కలిపిన రమణీగారికి, శుభమస్తు" అని రాసి ఇచ్చారు.

ఆ గుర్తింపు నాకెంతో సంతోషాన్ని కలిగించింది. పిల్లలకి తమకి ప్రైజురావడం కన్నా ఆ ప్రైజుని పెద్దవాళ్ళు మెచ్చుకుని 'శభాష్. ఎంత బావుందో' అంటే ఎక్కువ సంతోషం కలుగుతుంది కదా!

అందుకే నాకు మెచ్యూరిటీ ఉందా అని నా సందేహం!!!




COMMENTS

